క్లుప్తంగా

వేడుకగా శివపార్వతుల కల్యాణం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో నిర్వహిస్తున్న నూతన విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. శివపార్వతులు, త్యాగరాజేశ్వర కమలాంబిక శాంతి కల్యాణాన్ని ప్రతిష్ఠాపనాచార్యులు వెంకటసుబ్బయ్యశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. త్యాగరాజేశ్వరుడు, కమలాంబిక, దక్షిణామూర్తి, నందీశ్వరుడు, సాయిబాబా, శివపార్వతుల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మందిర ధర్మకర్త చైతన్య కుమార్, వైష్ణవి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలో పూజలు

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో రావణసేవను బుధవారం నిర్వహించారు. దేవస్థాన అర్చకులు విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా వెంకటరమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటరమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు


మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: జిల్లాలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నిధులను భారీగా మంజూరు చేయనున్నామని చెప్పారు. రూరల్ మండలంలోని ప్రాంతాల్లో 24 పనులకు రూ.2.84 కోట్ల 15వ ఆర్థిక సంఘ నిధులు.. ఆరు పనులకు రూ.30.4 లక్షల జెడ్పీ సాధారణ నిధులను మంజూరు చేయనున్నామని వెల్లడించారు.

అధికారులపై ఆగ్రహం

మండల సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వీరి నిర్లక్ష్య వైఖరిపై అరుణమ్మ అసహనం వ్యక్తం చేశారు. వీరిపై తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు రవీంద్రరెడ్డి, దేవసేన, ఎంఈఓ తిరుపాల్, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవన్ముక్తి

నెల్లూరు(బృందావనం): ఆధ్యాత్మిక చింతనతో జీవన్ముక్తిని పొందాలని విరువూరు శుకమహర్షి ఆశ్రమాధిపతి మార్కండేయానందగిరి ప్రవచించారు. పొగతోటలో చక్రాలవారి ట్రస్టుకు చెందిన ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్యుల సంస్మరణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. సుందరకాండపై ఆంజనేయవరప్రసాద్‌రావు ప్రవచించారు. అనంతరం మార్కండేయానందగిరి, ఆంజనేయవరప్రసాద్‌రావును సత్కరించారు. చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్‌కుమార్, సమయానంద, ప్రభాకర్‌రావు, శ్రీకాంత్‌శర్మ, వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటుపై నివేదిక అందజేత

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగంలో కమిటీల ఏర్పాటుకు సంబంధించిన నివేదికను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి బుధవారం అందజేశారు. పార్టీ బలోపేతానికి మహిళా కమిటీలు దోహదపడతాయని ఆమె తెలిపారు.

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు మహిళా కమిటీల ఏర్పాటు అంశాన్ని మంత్రికి తెలియజేశారు.

కలెక్టర్‌తో వేమిరెడ్డి భేటీ



నెల్లూరు (దర్గామిట్ట): చుక్కల భూముల విషయమై నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్‌తో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. చుక్కల భూములకు సంబంధించిన సుమారు 31,960కు గానూ 20,981 ఎంట్రీలను నిషేధిత జాబితా నుంచి తొలగించారని, మిగిలిన వాటిని సైతం తొలగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జేసీ కూర్మనాథ్ పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో తనిఖీలు

నెల్లూరు(అర్బన్): మూలాపేటలోని రాజాగారివీధిలో గల యూపీహెచ్‌సీని జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ హరిశ్చంద్ర సతీష్ తనిఖీ చేశారు. కోవిడ్ శాంపిళ్లు ఎన్ని తీశారు.. ర్యాండమ్‌గా ప్రస్తుతం ఎన్ని పరీక్షలు చేస్తున్నారనే అంశాలను పరిశీలించారు.

నృసింహుడికి సింహవాహన సేవ

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహన సేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా విజయ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చిరంజీవి, భాస్కర్, రాజారావు వ్యవహరించారు. స్వామివారిని కేంద్ర రక్షణ శాఖ మంత్రి సాంకేతిక సలహాదారుడు గుండ్రా సతీష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

వివాహిత మృతి

నెల్లూరు(క్రైమ్): వివాహిత మృతి చెందిన ఘటన భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో ఇళ్లలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. టిడ్కో ఇళ్లలో రమేష్, బాలేశ్వరి (50) దంపతులు నివాసం ఉంటున్నారు. ఓ ప్రభుత్వ కార్యాలయంలో అటెండర్‌గా ఆయన పనిచేస్తున్నారు. కుమారుడు వీరికి దూరంగా ఉంటుండగా, కుమార్తెకు సుబ్రహ్మణ్యం అనే వ్యక్తితో వివాహం చేశారు. మనస్పర్థల నేపథ్యంలో భర్త, పిల్లలను వదిలి తనకు పరిచయం ఉన్న గణేష్‌తో వెళ్లిపోయి హైదరాబాద్‌లో ఆమె ఉంటున్నారు. ఇటీవల ఆయన్నూ వదిలేసి ఎటో వెళ్లిపోయారు. దీంతో ఆమెను వెతుక్కుంటూ ఈ నెల రెండున రమేష్ ఇంటికి గణేష్ వచ్చారు. విషయాన్ని తెలియజేసి ఆమె కోసం ఆరాతీశారు. రమేష్ దంపతులు, గణేష్ కలిసి మద్యం సేవించారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో బాత్‌రూమ్‌కు బాలేశ్వరి వెళ్లారు. ఆమె అక్కడ కిందపడటంతో శబ్దం రాగా రమేష్, గణేష్ వెళ్లి పరిశీలించారు. నడవలేని స్థితిలో ఉండటంతో ఆమెను తీసుకొచ్చి పడుకోబెట్టి నిద్రపోయారు. ఉదయం నిద్రలేచిన రమేష్ తన భార్యను లేపేందుకు యత్నించగా, ఆమె నుంచి స్పందన రాలేదు. నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో యాసిడ్ తాగడంతో బైపాస్ సర్జరీ అయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రెహ్మాన్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

మంత్రిని కలిసిన ల్యాబ్ టెక్నీషియన్ నేతలు

నెల్లూరు (దర్గామిట్ట): తమ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. అనంతరం శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీరా మొహిద్దీన్, కోశాధికారి చంద్రమౌళి, కిషోర్, నరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

క్యారమ్స్ శిక్షణ శిబిరం ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వేసవి శిక్షణలో భాగంగా క్యారమ్స్ శిక్షణ శిబిరాన్ని మూలాపేటలోని వాగ్దా స్కూల్లో సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ఈఎస్సార్‌ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శివరామ్‌ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో, క్యారమ్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో వాగ్దా స్కూల్ ప్రిన్సిపల్ స్వరూపారెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

‘మాదిగల సంక్షేమాన్ని విస్మరించిన కోటంరెడ్డి’

నెల్లూరు (వేదాయపాళెం): మాదిగల సంక్షేమం, అభివృద్ధిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విస్మరించారని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య ఆరోపించారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాళ్లపై ప్రశ్నిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ ప్రధాన సమస్యలపై ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, రవి రాఘవేంద్ర, సుబ్బారావు, వెంకట్రావ్, శ్రీనివాసులు, కన్యకేశ్వరరావు, సాల్మాన్ పాల్గొన్నారు.

జాకీర్‌హుస్సేన్‌కు నివాళులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, నేతలు చాన్‌బాషా, అన్సర్, షబ్బీర్, జాఫర్, దస్తగిరి, ఉస్మాన్, ముస్లిం మైనార్టీ నేత కరిముల్లా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు తిరిగివ్వాలంటూ ధర్నా

నెల్లూరు (టౌన్): పూర్వ విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి తిరిగివ్వాలని భగత్ స్టూడెంట్స్ అసోసియేషన్ నేతలు బాబీ భగత్, అమృత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు రామలింగాపురంలోని జగన్స్ కళాశాల ఎదుట ధర్నాను బుధవారం చేపట్టారు. వివిధ సాకులు చెప్పి సర్టిఫికెట్ల కోసం పూర్వ విద్యార్థులను కళాశాల చుట్టూ తిప్పుకోవడం సరికాదని హితవు పలికారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (లీగల్): రాష్ట్ర పోలీస్ కంప్లయింట్ సెల్ సభ్యురాలిగా నియమితులైన నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన మహిళా న్యాయవాది రమాదేవి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రికి కృతజ్ఞతలను తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ క్లబ్ నెల్లూరు ఆడిటోరియంలో కూచిపూడి నృత్య ప్రదర్శనను రోటరీ క్లబ్ నెల్లూరు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కావలికి చెందిన జయం నాట్యాలయ బృంద గురువులు జాహ్నవి, జమున ఆధ్వర్యంలో నిఖిత, మహిత, సుహిత, మేఘశ్రీ, తదితరులు తమ నాట్య ప్రదర్శనతో సభికుల హర్షధ్వానాలను అందుకున్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్‌రెడ్డి, ఉదయభాస్కర్, సభ్యులు దయానంద్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంతోత్సవాలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కైలాస సేవ కార్యక్రమానికి ఉభయకర్తగా సత్యనారాయణగుప్తా వ్యవహరించారు.

ఆఫర్ లెటర్ల అందజేత

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 150 మంది విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. వీరికి వార్షిక వేతనంగా రూ.రెండు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు అందించనున్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, రాయాయపట్నం ప్రాజెక్ట్ మేనేజర్ శేషు, ప్రిన్సిపల్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

చిత్ర పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు రూరల్: నూతన నటీనటులతో నెల్లూరు పరిసర ప్రాంతాల్లో నిర్మించిన కొమరంపూడి చిత్ర పోస్టర్లను గాంధీనగర్‌లో బుధవారం ఆవిష్కరించారు. నిర్మాత, దర్శకుడు గిరీష్, ఆర్పీ, మాజీ కార్పొరేటర్ లతితారామ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఉపాధి పనులు

నెల్లూరు(పొగతోట): ఉపాధి పనులను నిబంధనల మేరకు నిర్వహించాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నగరంలోని శిక్షణ కేంద్రంలో టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏపీడీ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తాం

నెల్లూరు రూరల్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తామని భజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ నీరజ్ దొనేరియా పేర్కొన్నారు. నారాయణరెడ్డిపేటలోని సత్యసాయి స్కూల్లో నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో భజరంగ్‌దళ్‌ను నిషేధిత పీఎఫ్‌ఐతో పోలుస్తూ మేనిఫెస్టోలో పెట్టడం దురదృష్టకరమన్నారు.

‘డీకేడబ్ల్యూ’కు న్యాక్ ఏ గ్రేడ్

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ లభించిందని ప్రిన్సిపల్ గిరి పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఏ గ్రేడ్ ఉన్న కళాశాలల్లో చదివిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. అధ్యాపకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

నెల్లూరు(అర్బన్): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న సీహెచ్‌ఓలకు వేతనాన్ని పెంచాలని ఎమ్మెల్‌హెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అనిత కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని అసోసియేషన్ నేతలు బుధవారం అందజేశారు. నేతలు కృష్ణవేణి, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకుందాం

నెల్లూరు (వేదాయపాళెం): విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రదర్శనను కార్మిక సంఘాల ఐక్యవేదిక, విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో బుధవారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సుధాకర్, రైతు సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వెంగయ్య, శ్రీరాములు, సీపీఐ నేతలు సిరాజ్, షానవాజ్ పాల్గొన్నారు.

- ఆర్టీసీ కూడలిలో రాస్తారోకోను కార్మికులు చేపట్టారు. సీఐటీయూ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు గోపాల్, పెంచలనర్సయ్య, ప్రసాద్, సంపత్, మాలకొండయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు సహకరించాలి

నెల్లూరు(మినీబైపాస్): క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. ఏడో డివిజన్లోని తోటబడి, 8వ డివిజన్లోని తడికలబజార్ ప్రాంతాల్లో గల శానిటేషన్ మస్టర్ పాయింట్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రుణ మేళా

వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో నిర్వహించిన రుణ మేళాకు కమిషనర్ హాజరయ్యారు. 3, 9, 13, 45వ డివిజన్లకు చెందిన సుమారు 150 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.